

నర్సులకు కూడా రక్షణ కల్పించాలి

కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై హత్యాచారం సంఘటన భయాందోళనకు గురిచేస్తోంది. అందువలన నైట్ డ్యూటీలు చేసే తమలాంటి స్టాఫ్ నర్సులకు కూడా రక్షణ కల్పించాల్సి ఉంది. రాత్రి సమయాల్లో డెలివరీలకు వచ్చే వారి వెంట ఎవరెవరో వస్తుంటారు. అలాంటి సమయంలో కాస్త భయం వేస్తుంటుంది. నిత్యం ఎవరు ఎలాంటి వారో అని అనుమానిస్తూ డ్యూటీ చేయలేం. మా ఆస్పత్రికి దగ్గర్లోనే పోలీస్‌స్టేషన్ ఉంది. నైట్ డ్యూటీ పోలీసులు మధ్యమధ్యలో ఆస్పత్రిని కూడా సందర్శిస్తే కొంత ధైర్యంగా ఉంటుంది. ఏదైనా జరిగిన తర్వాత హడావిడి చేయడం కంటే ముందుగానే వైద్యసిబ్బంది భద్రతకు సంబంధించిన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– సుశీల, స్టాఫ్ నర్స్, మద్దిపాడు పీహెచ్‌సీ





వైద్యసిబ్బందికి సెక్యూరిటీ కల్పించాలి

వైద్యసేవలు అందించి ప్రాణాలు కాపాడే డాక్టర్లపై హత్యాచారాలకు పాల్పడటం హేయమైన చర్య. కోల్‌కతా సంఘటనలు జరగకుండా వైద్యసిబ్బందికి ప్రభుత్వం చట్టపరమైన సెక్యూరిటీ కల్పించాలి. రోగులు, అటెండర్లు, ఇతర వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టాలి. ప్రత్యేకంగా పోలీస్ ప్రొటెక్షన్, సీసీ కెమెరాలు వంటివి ఏర్పాటు చేయాలి. హాస్పిటల్ ముఖద్వారంలోనే లోపలికి వచ్చే వారి బయోడేటా తీసుకోవాలి. డాక్టర్లకు సపోర్టుగా మెడికల్ సిబ్బంది ఉండాలి. రాత్రివేళల్లో మహిళా పోలీసులను రక్షణగా ఏర్పాటు చేయాలి. ఎక్కడైనా అత్యాచారాలు జరిగితే నిందితులకు వెంటనే శిక్ష పడేలా కొత్త చట్టాలు తేవాలి.

– డాక్టర్ శివపార్వతి, ఈతముక్కల పీహెచ్‌సీ

క్లుప్తంగా

కారు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

ఒంగోలు సెంట్రల్: రూడ్ సెట్ సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుంచి పురుషులకు కారు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాలకు చెందిన ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు 94925 83484 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

చీమకుర్తి: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని చీమకుర్తి సీఐ ఎం.సుబ్బారావు ఇంజినీరింగ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. శనివారం చీమకుర్తిలోని బీవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈవ్‌టీజింగ్‌కు దూరంగా ఉండాలని, మద్యం, మత్తు పదార్థాలకు అలవాటుపడవద్దని హితవు పలికారు. యువతకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తన ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని భరోసా కల్పించారు. కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలు



బాలసదన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న న్యాయమూర్తి అమ్మనరాజా

ఒంగోలు సిటీ: చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని మొదటి అదనపు జిల్లా ఇన్‌చార్జి న్యాయమూర్తి, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి డి.అమ్మనరాజా అన్నారు. శనివారం ఒంగోలులోని బాలసదన్‌ను ఆయన సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన సదుపాయాలను పరిశీలించారు. రికార్డులు, కార్యాలయ నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ఆదేశించారు. మానసిక వైద్యుల అవసరం ఉన్న పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.శ్యాంబాబు, పిల్లల చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ దినేష్ పాల్గొన్నారు.

సాంకేతిక రంగాలపై అవగాహన కల్పించాలి

ఒంగోలు అర్బన్: విజ్ఞాన, శాస్త్రసాంకేతిక రంగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఒంగోలు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి అనిత రోజ్‌రాణి సూచించారు. స్థానిక ప్రజా సమస్యల పరిష్కార వేదిక భవనంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కస్తూరిబా, ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోజ్‌రాణి మాట్లాడుతూ విద్యార్థులతో ప్రాజెక్టు వర్కులు చేయిస్తూ టెక్నాలజీపై అవగాహన కల్పించాలని సూచించారు. తద్వారా వారిని ఉన్నత ప్రతిభావంతులుగా తయారు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి టి.రమేష్, తిరుపతయ్య, రాము, రమణయ్య, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొని పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చేపట్టాల్సిన చర్యలను వివరించారు.

ఎంఈఓ సేవలు అభినందనీయం

చీమకుర్తి: ఎంఈఓగా కే శివాజీ చీమకుర్తి మండలానికి అందించిన సేవలు అభినందనీయమని ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా, మండల నాయకులు బీ శేషారావు, జే యాకోబు అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఎంఈఓగా ఎంపికై అవార్డు అందుకున్న ఎంఈఓ శివాజీని శనివారం చీమకుర్తిలోని ఎంఈఓ కార్యాలయ ఆవరణలో ఘనంగా సత్కరించారు. ఆయనతో పాటు పీ నాయుడుపాలెం జెడ్పీ హైస్కూల్లో ఇంగ్లిష్ స్కూలు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పీ రమేష్‌కు ఇంగ్లిష్‌లో డాక్టరేట్ అవార్డు వచ్చిన సందర్భంగా ఇద్దరినీ కలిపి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొంతా ఏసుదాస్, ఆవుల హరిబాబు, రామడుగు శ్రీనివాసరావు, పీ నాగేశ్వరరావు, ఎంఆర్‌సీ కార్యాలయ సిబ్బంది, స్థానిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలో విజయవాడకు తరలిరండి

చీమకుర్తి: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆదివారం విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు తరలిరావాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ కన్వీనర్ బండ్ల డేవిడ్, వేమా బాలకోటేశ్వరరావు, పిల్లి కోటేశ్వరరావు, మట్టిగుంట రామాంజులు, వేమా శేషు, ప్రతాప్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. చీమకుర్తి మండలం నుంచి మాల ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, మాలమహానాడు కార్యకర్తలు, విద్యార్థులు తరలిరావాలని కోరారు.

ఇసుకపచ్చ మాఫియాతో పోలీసు కుమ్మక్కు

- గ్రామస్తులు పట్టించిన ఇసుక టిప్పర్లను సైతం వదిలేస్తున్న వైనం
- అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తోడు లంచాలు మింగేస్తూ ఇష్టారాజ్యం
- పోలీసుల అండతో మరింత రెచ్చిపోతున్న ఇసుక మాఫియా
- వైఎస్సార్ సీపీ మద్దతుదారుడి టిప్పర్‌పై మాత్రమే కేసు నమోదు
- టీడీపీ వర్గీయుల టిప్పర్‌కు పెనాల్టీతో సరిపెట్టి వదిలేయడంపై పెద్ద ఎత్తున విమర్శలు

కొత్తపట్నం: అధికార పార్టీకి చెందిన ఇసుక మాఫియాతో పోలీసులు కుమ్మక్కవడం కొత్తపట్నం మండలంలో తీవ్ర విమర్శలకు తావిస్తోంది. మండలంలో ఇసుక క్వారీ లేదు. అయినప్పటికీ నిత్యం భారీ సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు టీడీపీ నాయకులు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నప్పటికీ పోలీసులు, సెబ్, రెవెన్యూ అధికారులు పట్టించుకోకుండా వదిలేస్తున్నారు. టీడీపీ నాయకుల ఒత్తిళ్లతో పాటు లంచాలకు అలవాటుపడి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చివరకు గ్రామస్తులు పట్టించిన ఇసుక టిప్పర్లను కూడా వదిలేస్తున్నారు. గత వారంతో పాటు రెండు రోజుల క్రితం మండలంలో జరిగిన సంఘటనలే ఇందుకు నిదర్శనంగా ఉన్నాయి. ఈ నెల 22వ తేదీ అర్ధరాత్రి కూటమి పార్టీల నాయకులు నాలుగు టిప్పర్లతో కొత్తపట్నం నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించినా గంటల తరబడి ఎవరూ స్పందించలేదు. ఉద్దేశపూర్వకంగా టిప్పర్లన్నీ వెళ్లిపోయాక వచ్చి ఒకేఒక ఇసుక టిప్పర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దానిపై కూడా కేసు నమోదు చేయకుండా ఆ తర్వాత రోజే రూ.25 వేలు జరిమానా వేసి పంపించివేశారు. పది రోజుల క్రితం కూడా టీడీపీ నేతలకు చెందిన ఇసుక టిప్పర్లను గ్రామస్తుల బలవంతం మేరకు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఆ తర్వాత పంపించి వేశారు.

వైఎస్సార్ సీపీ మద్దతుదారుల టిప్పర్లు అయితే కేసుల నమోదు...

టీడీపీ నేతల టిప్పర్లకు సింపుల్‌గా ఫైన్ వేసి పంపించివేస్తున్న పోలీసులు.. వైఎస్సార్ సీపీ మద్దతుదారుల టిప్పర్లను పట్టుకుంటే మాత్రం కేసులు నమోదు చేస్తూ వాహనాలను సీజ్ చేస్తున్నారు. జీవో ఎంఎస్ నంబర్ 43 ప్రకారం తొలిసారి పట్టుబడితే రూ.25 వేలు జరిమానా, అదే వాహనం రెండోసారి పట్టుబడితే రూ.50 వేలు, మూడోసారి పట్టుబడితే కేసు నమోదు చేసి సీజ్ చేయడం జరుగుతుంది. అందులో భాగంగానే టీడీపీ నాయకుడి టిప్పర్‌కు రూ.25 వేలు పెనాల్టీ వేసి వదిలివేశామని పోలీసులు చెబుతున్నారు. కానీ, ఇదే విధంగా తొలిసారి పట్టుబడిన వైఎస్సార్ సీపీ మద్దతుదారుడి టిప్పర్‌పై మాత్రం కేసు నమోదు చేశారు. ఈ నెల 12వ తేదీ ఓ వైఎస్సార్ సీపీ నాయకుడి టిప్పర్‌లో ఇసుక తరలిస్తుంటే పోలీసులు పట్టుకుని పెనాల్టీ వేయకుండా తొలిసారి అయినప్పటికీ కేసు నమోదు చేశారు. టీడీపీ వారికి ఒక న్యాయం.. వైఎస్సార్ సీపీ వారికి మరొక న్యాయం ఏమిటని పోలీసుల తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై బాధితుడు మద్దెల రఘురెడ్డి పోలీసులను నిలదీసి మీడియా ముందుకొచ్చి చెప్పినా ప్రయోజనం లేకుండా పోయింది. దీనిపై అప్పటి కొత్తపట్నం ఎస్సై బి.సాంబశివరావు మీద హైకోర్టులో పిటీషన్ కూడా దాఖలు చేశాడు.



కేసు నమోదు చేసి కొత్తపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఉంచగా తుప్పుపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడి టిప్పర్

దానిపై కోర్టులో వాదోపవాదనలు జరుగుతున్నాయి. జీవో ఎంఎస్ నంబర్ 43 ప్రకారం మొదటి తప్పుగా రూ.25 వేలు ఫైన్ వేయకుండా కేసు ఎందుకు నమోదు చేశారని పిటీషన్‌లో పేర్కొన్నారు. టీడీపీ నాయకులకు ఒక చట్టం, వైఎస్సార్ సీపీ నాయకులకు మరో చట్టమా అంటూ ప్రజలు సైతం పోలీసుల తీరును అసహ్యించుకుంటున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తుంటే కేసులు నమోదు చేయాలని కలెక్టర్, ఎస్పీలు సైతం ఆదేశాలు జారీ చేసినా.. స్థానిక పోలీసులు బేఖాతరు చేస్తూ పచ్చపార్టీ నేతల ఇసుక దందాకు సహకరిస్తూ జేబులు నింపుకుంటున్నారు.

కొత్తపట్నం మండలంలో ఇసుక తవ్వొద్దని హైకోర్టు ఉత్తర్వులు...

కొత్తపట్నం మండలంలో ఇసుక తవ్వకాలు జరపొద్దని 2016లో హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో కొత్తపట్నం మండలం మోటుమాల రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 465ఏలో ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుని ఇసుక వ్యాపారం చేశారు. రోజూ వందల ట్రాక్టర్ల ఇసుక తవ్వి అమ్ముకున్నారు. మీ సేవలో చలానా కడితే ఎంత ఇసుక కావాలో అంత తవ్వుకోవచ్చని చెప్పడంతో విచ్చలవిడిగా తరలించారు. ఇక్కడ ఇసుక తరలిస్తే రాబోయే రోజుల్లో గ్రామాలకు ముప్పు వాటిల్లుతుందని, విపత్తులు, వరదలు వచ్చినప్పుడు గ్రామాలు దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని మోటుమాల గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్లను నిలిపివేసినా.. పోలీసుల ప్రొటెక్షన్‌తో లాఠీచార్జి చేసి మరీ ఇసుకను తరలించారు. దీనిపై పోలీసులకు – గ్రామస్తులకు స్వల్ప ఘర్షణ కూడా జరిగింది. దీంతో మోటుమాల గ్రామస్తులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు పరిశీలించి ఇక్కడి నుంచి ఇసుక తరలించవద్దని ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి కొత్తపట్నం మండలం నుంచి ఇసుక తరలించకుండా గత ప్రభుత్వం కూడా సహకరించింది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ ఇసుక దందాను ప్రారంభించారు. పోలీసులు, మైనింగ్, రెవెన్యూ, సెబ్ అధికారులు కొమ్ముకాస్తుండటంతో మరింత రెచ్చిపోతున్నారు.

> **నేను రాకముందు కేసు నమోదు చేశారు**
>
> జీవో ఎంఎస్ నంబర్ 43 ప్రకారం మొదటిసారి ఇసుక వాహనం పట్టుబడితే రూ.25 వేలు, రెండోసారి రూ.50 వేలు జరిమానా వేస్తారు. మూడోసారి పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేస్తాం. వైఎస్సార్ సీపీ నాయకుడు రఘురెడ్డి వాహనంపై తొలిసారే కేసు నమోదు చేసిన విషయం నాకు తెలియదు. అప్పటికి నేను రాలేదు. గత ఎస్సై బి.సాంబశివరావు కేసు నమోదు చేసిన దానిపై ఇప్పుడు నేను ఏమీ చేయలేను. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు కఠిన చర్యలు మాత్రం తీసుకుంటాం.
>
> – వేముల సుధాకర్, ఎస్సై, కొత్తపట్నం

ఫార్మా కంపెనీ యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలి



ర్యాలీలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు

ఒంగోలు సెంట్రల్: అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంపై ఆ కంపెనీ యాజమాన్యాన్ని అరెస్ట్ చేసి బాధితులకు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కొత్తపట్నం బస్టాండ్‌లో సీఐటీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రమాదంలో 18 మంది మృతి చెంది 50 మంది కార్మికులు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఈ ప్రమాదం కేవలం ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యం వలనే జరిగినట్లు ఆరోపించారు. ప్రభుత్వాలు కూడా ఫ్యాక్టరీల నిర్వహణపై తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం కూడా ఒక కారణమని అన్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, అంగవైకల్యానికి గురైన కార్మికులకు రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగర కార్యదర్శి టి.మహేష్ మాట్లాడుతూ కంపెనీలపై రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం తనిఖీలు నిర్వహించి నిర్లక్ష్యంగా ఉన్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. నగర కమిటీ నాయకురాలు రత్నకుమారి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ నాయకులు మోహన్‌రావు, కె.రవి, వంశీ, రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే మహిళలపై దాడులు

ఒంగోలు సెంట్రల్: ప్రభుత్వ వైఫల్యం కారణంగానే మహిళలపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి జీవీ కొండారెడ్డి అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో శనివారం ఐద్వా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎస్‌డీ షర్మిల అధ్యక్షత వహించగా, జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ ఏదైనా సంఘటన జరిగినప్పుడు ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమవుతోంది మినహా.. పరిష్కార మార్గాలు వెతకడం లేదన్నారు. డ్రగ్ మాఫియాపై చర్యలు, మద్యం నియంత్రణ చేపట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్న నేపథ్యంలో మహిళలపై దాడులు పెరుగుతున్నాయని చెప్పారు. విద్యార్థులపై ఈ ప్రభావం పడటం దారుణమన్నారు. మహిళలు ఏకతాటిపైకి వచ్చి దాడులను ప్రతిఘటించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం మహిళా చట్టాలను కాపాడటంలో విఫలమైందని విమర్శించారు. నిరుద్యోగం, డ్రగ్ మాఫియా వంటివి దేశాభివృద్ధికి ఆటంకాలుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా సంఘాల వారు మహిళలను చైతన్యవంతం చేసే బాధ్యత తీసుకున్నప్పుడే సమాజంలో మార్పు తీసుకురాగలమని అన్నారు. ముందుగా సంఘ జెండాను జిల్లా ఉపాధ్యక్షురాలు జి.ఆదిలక్ష్మి ఆవిష్కరించి శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్యదర్శి రమాదేవి, ఎస్.మాలతి, షేక్ నాగూర్, యు.రాజ్యలక్ష్మి, కె.ప్రసన్న, జి.భానుమతి, విశ్రాంత, రాజేశ్వరి, కృపావతి, నాగేంద్రం, పెద గోవిందమ్మ, ప్రేమలత, కె.మదారమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి కొండారెడ్డి

సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించడాన్ని స్వాగతిస్తున్నాం

ఒంగోలు సెంట్రల్: కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచారం కేసును సుప్రీంకోర్టు సుమోటాగా స్వీకరించి కీలకమైన ప్రశ్నలు లేవనెత్తడాన్ని స్వాగతిస్తున్నామని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. స్థానిక చైతన్య కాలేజీలో విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ నగర్ కార్యదర్శి బీ వీరాస్వామి అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. రమాదేవి మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపాల్, పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వం కుమ్మక్కై సాక్ష్యాధారాలను నాశనం చేసి అసలైన నిందితులను తప్పించడానికి ప్రయత్నం చేసినట్లు దేశమంతా గమనించి నివ్వెరపోయిందన్నారు. పోలీస్ శాఖ మాటల్లో కాకుండా చేతల్లో మహిళలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఐద్వా నాయకులు రాజేశ్వరి, ఎస్ఎఫ్ఐ నగర నాయకుడు విజయ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన నారు అందించాలి

- హార్టీకల్చర్ అధికారిణి ప్రత్యూష

మద్దిపాడు: రైతులకు నాణ్యమైన నారు అందించాలని నర్సరీల యజమానులకు హార్టీకల్చర్ అధికారిణి ప్రత్యూష సూచించారు. మద్దిపాడు మండలంలోని వెల్లంపల్లి, కొలచనకోట గ్రామాల్లో మిరపనారు సాగు చేస్తున్న నర్సరీలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీల యజమానులతో ఆమె మాట్లాడుతూ నర్సరీల నుంచి మిరపనారు తీసుకునే రైతులకు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు. నర్సరీలకు సంబంధించి రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, లేకపోతే నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. నర్సరీల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నర్సరీ పేరు కనిపించే విధంగా ప్రత్యేకంగా బోర్డులు తయారు చేసుకోవాలని ఆమె తెలిపారు. మొక్కల ధరలను పట్టికలో సూచించాలని, నర్సరీలో యాజమాన్య పద్ధతులు కూడా రికార్డు చేయాలని ఆమె తెలిపారు. నారు ఉత్పత్తి, అమ్మకాల వివరాలు నమోదు చేయాలని, లైసెన్స్ లేకుండా నర్సరీలో నారు విక్రయించరాదని సూచించారు. నర్సరీలను రిజిస్టర్ చేయించని వారు వెంటనే నర్సరీ రిజిస్ట్రేషన్ యాక్ట్ 2010 కింద రిజిస్టర్ చేయించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఉద్యానవన శాఖ వారు పూల తోటలు, పండ్ల తోటలు, కూరగాయలు సాగు చేసే రైతులకు రాయితీలు అందిస్తున్నట్లు డ్రిప్ స్ప్రింక్లర్లు కూడా ఇచ్చేందుకు రిజిస్ట్రేషన్ మొదలైందని, ఆసక్తి ఉన్న రైతులు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.



కొలచనకోట షేడ్ నెట్ నిర్వాహకునితో మాట్లాడుతున్న హార్టీకల్చర్ అధికారిణి ప్రత్యూష

పీవీఆర్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు

ఒంగోలు సెంట్రల్: స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం ముప్పా రాధిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఇంగ్లిషు ఉపాధ్యాయుడు రమణ, ప్రత్యేక ఆహ్వానితుడు ఈపూరి శివప్రసాద్ పాల్గొని విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు అలరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమాలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

స్పా సెంటర్లపై దాడులు

ఒంగోలు సెంట్రల్: నగరంలోని పలు స్పా సెంటర్లపై శనివారం రాత్రి ఒంగోలు తాలూకా సీఐ అజయ్‌కుమార్, వన్‌టౌన్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. నగరంలోని మంగమూరురోడ్డు, అంజయ్యరోడ్డు, 60 అడుగులరోడ్డు, కర్నూలు రోడ్డులోని స్పా సెంటర్లపై దాడులు చేశారు. ముందస్తు సమాచారంతో పలు చోట్ల షట్టర్లు మూసివేసి నిర్వాహకులు పరారయ్యారు.

చర్చి ప్రారంభం

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం గుమ్మలంపాడులో స్థానికులు నిర్మించిన చర్చిని ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ శనివారం ప్రారంభించారు. పాస్టర్ బిరుదుల జాన్‌బాబు, శోభారాణితో పాటు దాతల సహకారంతో చర్చిని నిర్మించినట్లు తెలిపారు.

అభయాంజనేయస్వామికి సహస్ర నాగదళార్చన



అభయాంజనేయస్వామి

ఒంగోలు మెట్రో: శ్రావణమాసం శనివారం సందర్భంగా ఒంగోలు మంగమూరుడొంక మర్రిచెట్టుకాలనీ వద్దగల పొలిమేర అభయాంజనేయస్వామికి సహస్ర నాగదళార్చన నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలను భక్తిశ్రద్ధలతో జరిపించారు. స్వామివారి మూలవిరాట్‌కు సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. తమలపాకులతో స్వామివారికి ప్రీతికరమైన సింధూరంతో అష్టోత్తర శతనామావళి పూజ, కర్పూర హారతి ఇచ్చారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కళ్యాణ వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు...

స్థానిక రంగారాయుడు చెరువు వద్ద గల శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శ్రావణమాసం శనివారాన్ని పురస్కరించుకుని తులసీ దళాలతో అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామివారి ఆశీసులు అందుకున్నారు.

వైభవంగా వెంకయ్యస్వామి నగరోత్సవం



పూజలందుకుంటున్న వెంకయ్యస్వామి

ఒంగోలు మెట్రో: స్థానిక సంతపేటలోని వెంకయ్యస్వామి మందిరంలో భగవాన్ గొలగమూడి వెంకయ్యస్వామి 42వ ఆరాధన మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం వెంకయ్యస్వామి మూలవిరాట్‌కు రుద్రాభిషేకం, విశేష దునిపూజ నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారి అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ప్రత్యేక హారతి, రాత్రికి పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం అలంకరించిన రథంపై వెంకయ్యస్వామిని ఉంచి సంతపేట, ప్రకాశం భవనం, ఏనుగు చెట్టు మీదుగా జిల్లా కోర్టు, లాయర్ పేట సాయిబాబా మందిరం వరకు నగరోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకుడు ఆవుల బ్రహ్మయ్య పర్యవేక్షించారు.